# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు, వరదల కారణంగా 6 వేల 882 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నివేదికను సిద్ధం చేసింది.**
2. **గత ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణపై ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు వెల్లడించారు.**
3. **తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో మళ్లీ వర్షాలు ప్రారంభం కావడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.**
4. **భారీ వర్షాల కారణంగా బుడమేరుకు పడిన మూడు గండ్లను విజయవంతంగా పూడ్చామని ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
5. **మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడింది. దీని ప్రభావంతో ఈ రోజు, రేపు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు, వరదల కారణంగా 6 వేల 882 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నివేదికను సిద్ధం చేసింది. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపనుంది. రోడ్లు భవనాల శాఖకు 2 వేల 164 కోట్లు, నీటివనరుల శాఖకు వెయ్యి 568 కోట్లు, పురపాలకశాఖకు వెయ్యి 160 కోట్లు, రెవెన్యూశాఖకు 750 కోట్లు, విద్యుత్ శాఖకు 481 కోట్లు, వ్యవసాయశాఖకు 301 కోట్లు, పంచాయతీ రోడ్లకు 167 కోట్లు, మత్స్యశాఖకు 158 కోట్లు, గ్రామీణ నీటిసరఫరాకు 75 కోట్లు, ఉద్యానశాఖకు 40 కోట్లు, పశుసంవర్ధకశాఖకు 11 కోట్లు, అగ్నిమాపకశాఖకు 2 కోట్ల రూపాయల చొప్పున నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాష్ట్రంలో పర్యటించి వరద నష్టాన్ని పరిశీలించారు.

--------------------------

గత ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణపై ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ నగరంలోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. వరద ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఇంకా 4 అడుగుల మేర నీరు నిలిచి ఉందని.. బాధితులకు ఇంటింటికీ

వెళ్లి సరకుల కిట్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఎవరికైనా అందకపోతే అడిగి తీసుకోవాలని సూచించారు. బుడమేరు గండ్లు పూడ్చివేత పూర్తయినందున సోమవారం ఉదయానికల్లా వరద సమస్య పరిష్కారం అవుతుందని ముఖ్యమంత్రి వివరిస్తూ...

....వాయిస్... (33సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలతో విజయవాడ నగరంలోని చిట్టినగర్ పరిధిలోని బుడమేరు కాల్వలో పూడికతీత పనులను అధికారులు వేగవంతం చేశారు. మొత్తం 15 మోటర్లతో నీటిని తోడి కాల్వలోకి మళ్లిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆర్మీ క్యాంప్ వాహనాల ద్వారా మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామని.. అగ్నిమాపక సిబ్బంది రహదారులను శుభ్రం చేస్తోందని తెలిపారు. తాగునీటి ట్యాంకుల ద్వారా ప్రతి ఇంటికి నీరు సరఫరా చేస్తున్నామని అచ్చెన్నాయుడు వెల్లడించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ వరద బాధితులకు సాయం చేస్తున్న యువతను మంత్రి అభినందించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద గేట్ల మరమ్మతులను అధికారులు పూర్తి చేశారు. 67, 69వ గేట్ల వద్ద దెబ్బతిన్న కౌంటర్ వెయిట్లను విజయవంతంగా అమర్చారు. భారీ వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా రెండు రోజుల్లోనే ఇంజనీర్లు, సిబ్బంది గేట్ల మరమ్మతు పనులు పూర్తి చేశారు. నదిలో లక్షన్నర క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నా గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో ఈ పనులు చేశారు. మరమ్మతులు పూర్తి కావడంతో అడ్డుగా ఉన్న పడవల తొలగింపుపై అధికారులు దృష్టి సారించారు.

---------------------------

తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో మళ్లీ వర్షాలు ప్రారంభం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలోనే ఖమ్మం జిల్లాకు చేరుకున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ జిల్లాలోని ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మున్నేరు వాగు పొంగి పొర్లే అవకాశం ఉండడంతో వరద ప్రమాదం పొంచి ఉంది అని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

ఎగువ నుంచి భారీగా వరదనీరు వస్తుండటంతో హైదరాబాద్‌లోని జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరాయి. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులు అప్రమత్తయ్యారు. ముందు జాగ్రత్తగా ఉస్మాన్‌సాగర్ 2 గేట్లను అడుగుమేర ఎత్తి 226 క్యూసెక్కుల నీటిని మూసీలోకి విడుదల చేస్తున్నారు. ఉస్మాన్‌సాగర్ పూర్తి నీటిమట్టం వెయ్యా 790 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం వెయ్యా 787.95 అడుగులకు చేరింది. హిమాయత్ సాగర్ ఒక గేటు అడుగు మేర ఎత్తి 340 క్యూసెక్కుల నీటిని మూసీకి విడుదల చేస్తున్నారు. హిమాయత్ సాగర్ పూర్తి నీటిమట్టం వెయ్యా 763.50 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం వెయ్యా 761.10 అడుగులకు చేరింది. వరద నీరు విడుదల చేస్తుండటంతో మూసీ పరివాహక ప్రాంత ప్రజలతో పాటు

హైదరాబాద్ మహా నగరపాలక మండలి.. జీహెచ్ఎంసీ, పోలీసులను జలమండలి అధికారులు అప్రమత్తం చేశారు.

---------------------------

భారీ వర్షాల కారణంగా బుడమేరుకు పడిన మూడు గండ్లను విజయవంతంగా పూడ్చగలిగామని ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రెండో దశలో వరదనీరు పెరిగినా తట్టుకునేలా మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు గట్లు ఎత్తు పెంచే పనులు చేపట్టామని వివరించారు. బుడమేరు పరివాహక ప్రాంతంలో మళ్లీ వర్షాలు పడి ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్న మంత్రి.. 8వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చే అవకాశం ఉందన్నారు. గండ్లు పూడ్చివేతతో విజయవాడ దిగువ ప్రాంతాలకు బుడమేరు వరద నీరు ఆగిపోయిందన్నారు. జక్కంపూడి, సింగ్ నగర్, నిడమానూరు వరకు నిలిచిపోయిన నీటిని కొల్లేరుకు పంపేలా చర్యలు చేపడతామని రామానాయుడు తెలిపారు.

---------------------------

పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్ దీప్తి జీవాంజికి గ్రూప్-2 ఉద్యోగం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దీప్తి కుటుంబ సభ్యులు, కోచ్, అధికారులు ముఖ్యమంత్రిని నిన్న మర్యాదపూర్వకంగా కలిశారు.

---------------------------

ఎగువ కృష్ణానదీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. అధికారులు జలాశయం ఎనిమిది గేట్లు పది అడుగుల మేర ఎత్తి 2 లక్షల 71 వేల 668 క్యూసెక్కులు.. కుడి, ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 67 వేల 668 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల విడుదల చేస్తున్నారు. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల, సుంకేసుల, హంద్రీ నుంచి 2 లక్షల 16 వేల 973 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. నిన్న సాయంకాలం 6 గంటలకు జలాశయం నీటిమట్టం 884.20 అడుగులు, నీటినిల్వ 210.99 టీఎంసీలుగా నమోదయింది. శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జున సాగర్‌కు వరద ప్రవాహం కొనసాగుతుండటంతో డ్యామ్ 16 గేట్లను 5 అడుగుల మేర, 8 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2 లక్షల 48 వేల 80 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28 వేల 298 క్యూసెక్కులు, కాలువల ద్వారా 5 వేల 112 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్‌కు 2 లక్షల 62 వేల 275 క్యూసెక్కుల నీరు వస్తోందని అధికారులు తెలిపారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 312.04 టీఎంసీలు కాగా.. పసుత నీటిమటం 310.55 టీఎంసీలుగా ఉంది. మరో వైపు పులిచింతల ప్రాజెక్టు నుంచి 2 లక్షల 86 వేల క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. బ్యారేజీ నుంచి ప్రస్తుతం 65 గేట్లు ఎత్తి 3 లక్షల 5 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడును ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో కలిశారు. ముఖ్యమంత్రి సహాయనిధికి కోటి రూపాయల చెక్కును ఆయన నిన్న అందజేశారు. ఈ క్రమంలో పవన్ కల్యాణ్ ఆరోగ్యం గురించి చంద్రబాబునాయుడు అడిగి తెలుసుకున్నారు. వరద బాధితుల సహాయార్థం ఉప ముఖ్యమంత్రి ఇటీవల భారీ విరాళం ప్రకటించారు.

----------------------------

మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది ఉత్తర దిశగా కదులుతూ ఒడిశా, పశ్చిమ బంగ, బంగ్లాదేశ్ తీరాల్లో రేపటికి వాయుగుండంగా మారనుంది. ఆ తర్వాత మూడు రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ ఉత్తర ఒడిశా, ఝార్ఖండ్, ఉత్తర ఛత్తీస్ గఢ్ మీదుగా ప్రయాణించే అవకాశముంది. దీని ప్రభావంతో ఈ రోజు, రేపు కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

=======================